కథ

**ఆరోజు సౌజన్య చాలా ఆనందంగా వుంది. తను ఎంతో ఇష్టపడి ఆర్డర్ చేసిన ముత్యాల హారం తెచ్చుకోవడానికి జ్యూయలరీ షాపుకి వెళ్తుంది. రేపు తమ 'మ్యారేజ్ యానివర్సరీ'కి తను ఆ నగ పెట్టుకోవచ్చు. నిజానికి సౌజన్యకి ఆభరణాలపై మరీ పెద్దగా మోజు లేదు. కానీ తన స్నేహితురాలు ఏదో నగ కొనుక్కుంటాను సెలక్షన్‌కి రమ్మని సౌజన్యని వెంట తీసుకెళ్ళింది.**

# అమూల్యాభరణం

ఆ షాపునకు వెళ్లినప్పుడు అద్దాల షోకేసులో కనిపించిన ఆ ముత్యాల ఆభరణం తన మనసును వెంటనే దోచుకుంది. దాన్నెలాగైనా స్వంతం చేసుకోవాలన్పించింది. ఆ నగ ఖరీదెంతో అడిగి తెలుసుకుంది. ''దాదాపు పద్దెనిమిది వేలు అవుతుందమ్మా'' అన్నాడు షాపతను.

ఆమె ఆలోచించింది. తన దగ్గర బ్యాంక్ అకౌంట్‌లో పధ్నాలుగు వేల వరకూ వున్నాయి. ఈ నెల జీతం ఐదువేలు వస్తుంది. అవి ఈ నెల భర్తకివ్వకుంటే తను తేలికగా ఆ హారం కొనుక్కోవచ్చు. ఇలా అనుకుంటూ... ఆ షాపు యజమానితో ''బాబూ! నేను ఆ ముత్యాల నగ కొనాలనుకుంటున్నాను. పదిరోజుల తర్వాత వచ్చి తీసుకుంటాను. అప్పటివరకూ ఆ నగ అమ్మకుండా ఆపగలరా?'' అని అడిగింది.

''ఆ సెట్టు ఆర్డర్ చేసినవారు రేపు తీసుకెళ్ళిపోతారమ్మా. కానీ మరేం ఫర్వాలేదు. చాలామంది కస్టమర్లకు ఆ డిజైన్ నచ్చడం వల్ల ఇటువంటి సెట్లు ఇంకా చేయిస్తున్నాము. వచ్చేవారం కల్లా రెడీ అవుతాయి. పదిరోజుల తర్వాత మీరు తప్పకుండా రండి. అలాంటి సెట్టు రెడీగా వుంటుంది'' అన్నాడు.ఆ తర్వాత ఆమె ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి ఆమె భర్త శేఖర్‌తో నగ విషయం చెప్పింది ''ఏమండీ! ఇన్నేళ్లుగా నేను మిమ్మల్ని ఏదీ అడగలేదు. నాకా నగ చాలా నచ్చింది. ఈ నెల నా శాలరీ మీకివ్వలేను. నేనా నగ తెచ్చుకుంటానండీ'' అని చెప్పింది.

అతను సౌజన్య వైపు మౌనంగా ఒక్కక్షణం చూశాడు. ఏమాత్రం కల్మషం లేక నిర్మలంగా ఉన్న ఆమె కళ్ళలోకి చూసి అనుకున్నాడు... నిజమే ఆమె ఏనాడూ ఏదీ ఇంతలా మనసుపడి అడగలేదు. ఇన్నేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నా లేనిదంటూ ఏమీ మిగుల్చుకోకుండా ప్రతినెలా జీతం తెచ్చి తన చేతుల్లోనే పోస్తుంది. ఈ మహాపట్నంలో ఒక్కరి జీతంతో కుటుంబం నడపడం కష్టం. తనకు అదృష్టవశాత్తు పిత్రార్జితం అయిన స్వంత ఇల్లుండటంతో ఇంకాస్త నయం. తమ ఇద్దరి జీతాలూ కలిపితేనే ఇంటి ఖర్చులు హాయిగా వెళ్లిపోతున్నాయి. మరీ కట్టడిగా కాకుండా కొంచెం సరదా అయిన జీవితాన్నే గడపగల్గుతున్నారు. అదీగాక శేఖర్‌కి అప్పంటే చాలా భయం. ఇంతవరకూ అలాంటి అవసరం రాకుండా నెట్టుకొస్తున్నారు. ఈ నెల సౌజన్య జీతం ఇవ్వకుంటే కాస్త కష్టమయ్యే మాట నిజమే కానీ ఎన్నేళ్ళకో కట్టుకున్న భార్య అడిగిన కోర్కె కాదనలేక ఈ నెల్లో ఇంకేదయినా ఖర్చు తగ్గించే మార్గం చూద్దాం అనుకుని ఆమె నగ కొనుక్కోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

అదీగాక ఆమె ఆ నగ కొనుక్కోవాలనుకోవడానికి స్త్రీ సహజంగా నగలపై మక్కువే కాకుండా అంతర్గతంగా ఇంకో కారణం కూడా వుంది.

శేఖర్‌కి ఒక వితంతువైన అక్క ఉంది. పేరు సుమతి. చిన్న వయసులోనే ఆమె భర్త పోవడం, అత్తవారి వైపు వెనకా ముందూ ఎవరూ లేకపోవడంతో ఆమె తన ఒక్క కొడుకునూ తీసుకుని వచ్చి తమ్ముని పంచన చేరింది. సహజంగా దయాగుణం గల శేఖర్ తనుండే ఇల్లు పిత్రార్జితం కాబట్టి తన తోడబుట్టినదానికి ఆమాత్రం నీడనివ్వాల్సిన బాధ్యత తనమీదుందనే సదుద్దేశ్యంతో ఆమెకు ఆశ్రయం కల్పించాడు.

సుమతి భర్త గవర్నమెంటు సర్వీస్‌లో ఉన్నప్పుడు పోవడం వల్ల కొంత డబ్బూ, నెల నెలా కొంత పెన్షనూ వస్తుంది. ఆమె ఆ డబ్బును తన తమ్ముడికిచ్చి ''ఎంతయినా ఈ రోజుల్లో మనిషికి మనిషి బరువురా తమ్ముడూ. మేం నీ ఇంట్లో పడి తింటే నీకు భారమే అవుతుంది'' అంది.

కానీ శేఖర్ ఆ డబ్బు తీసుకోలేదు. ఆమె పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేసి ''నీ కొడుకు చదువుకి పనికొస్తుంది ఉండనీలే అక్కా'' అన్నాడు.

కానీ ఆమె తనకొచ్చే భర్త పెన్షన్ డబ్బులు మాత్రం నెల నెలా తమ్ముడికివ్వసాగింది. అదీగాక తన తమ్ముడూ, మరదలూ ఉద్యోగస్థులవడంతో చక్కగా ఇల్లు చూసుకుంటూ వండి పెడ్తుంది. తమ్ముని కూతురైన సుప్రియను చక్కగా సంరక్షిస్తుంది. సౌజన్య కూడా ఆడపడుచును మర్యాదగానే చూస్తుంది. ఇలా వారు ఒకరికొకరు తోడుగా హాయిగా వుంటున్న తరుణంలో 'మంధర'లా ఆ ఇంటిలోకి కాంతమ్మ ప్రవేశించింది.

కాంతమ్మ ఎవరో కాదు సౌజన్య తల్లి. సౌజన్య అన్నయ్యకి ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అవడం వలన వాళ్ళు తల్లి కాంతమ్మను కూడా తీసుకుని ఢిల్లీ షిఫ్ట్ అయ్యారు. కానీ కాంతమ్మ అక్కడ పట్టుమని పది రోజులు కూడా ఉండలేకపోయింది. కూతురు దగ్గరుంటానని మొరాయించి హైదరాబాద్‌కి తిరిగి వచ్చింది.

సరే పెద్ద దిక్కుగా ఉంటుందిలే అనుకుని శేఖర్ కూడా ఆమె రాకకి ఒప్పుకున్నాడు. తల్లి సుస్తీపడినా, ఆమెకింకేమన్నా అవసరాలున్నా సౌజన్యకి భారం కాకుండా ఆమె అన్నగారు నెలకు వెయ్యి రూపాయలు మనియార్డర్ చేస్తాడు. ఆ డబ్బు మాత్రం సౌజన్య భర్తకివ్వకుండా తన పేరుమీద వేరే అకౌంట్ తెరిచి అందులో జమకట్టసాగింది. ఆ సలహా కాంతమ్మగారే ఇచ్చారు.


ఆమె వచ్చినప్పటినుండీ జోరీగలా పోరుతూనే వుంది. సుమతి వాళ్ళు తమ కూతురింట్లో ఉండటం ఆమెకు కంటగింపుగా వుంది. వాళ్ళేదో తిని పోతున్నారని కూతురికి నూరిపోయసాగింది. కానీ సౌజన్య చెప్పుడు మాటలకు లొంగేది కాదు.

ఇక తన పప్పులు ఇలా ఉడకవని గ్రహించిన కాంతమ్మ వేరేవిధంగా నరుక్కొచ్చింది. ''ఇన్నేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నావు, సొంతంగా ఏమన్నా నాలుగురాళ్ళు కూడబెట్టావా? ఒక నగన్నా కొనలేకపోయావు. ఈ కాలంలో ఇంత తెలివి తక్కువగా వుంటే ఎలాగే తల్లీ. రేపు నీకేదన్నా రోగం, రొష్టూ వస్తే ఎలా తల్లీ. అసలు కుటుంబం నడిపేది మగవాడి బాధ్యత. నీ జీతం అల్లుడిగారికెందుకిస్తావు? నీకొక ఆడపిల్ల వుంది. రేపు దాని పెళ్ళప్పుడు నాలుగు నగలయినా పెట్టొద్దూ. నా మాట విని అప్పుడప్పుడూ నీ జీతం డబ్బులు పెట్టి ఏదైనా నగ కొనుక్కోవే తల్లీ'' అని అంది.

ఇలా పోరగా పోరగా, అందులోనూ తనకు ఆ ముత్యాల హారంపై మరీ మక్కువ కలగడంతో, శేఖర్ కూడా ఒప్పుకోవడంతో ఇక సమస్యేముందీ? అదీగాక ఈరోజు తనకు శాలరీ చేతికొచ్చింది. కొన్న నగ పెట్టుకుతిరిగేందుకు రేపు తన పెళ్ళిరోజు కనుక సందర్భమూ కలిసి వచ్చింది.

ఆరోజు ఈ విధంగా సౌజన్య సంతోషంగా వుంటే ఆమె ఆడపడుచు సుమతి ఏమీ తోచనట్లుగా దీర్ఘాలోచనలో మునిగింది. అసలు సమస్యేమిటంటే

ఆమె కొడుకు శంతన్ ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అహ్మదాబాద్) కోర్సుకు ఎంట్రెన్స్ రాసి అందులో సెలక్టయ్యాడు. అది రెండేళ్ళ కోర్సు. ట్రైనింగ్ పీరియడ్‌లోనే పెద్ద పెద్ద కంపెనీల్లోని వాళ్ళు స్టూడెంట్స్ మెరిట్‌ని బట్టి జాబ్ ఆఫర్ చేస్తారు. కాకపోతే సమస్యేమి



టంటే ఆ కోర్సులో జాయినవ్వడానికి ఫీజు, వెళ్ళే ఖర్చూ అంతా కలిపి లక్ష రూపాయల వరకు అవుతుంది. సుమతి దగ్గర అంతా కలిపి ఎనభైవేల వరకూ వున్నాయి. ఆపైన పైసా కూడా పుట్టేట్టు లేదు. ఆమెకేం చెయ్యాలో తోచడం లేదు. దిగులుగా కూర్చుని ఉంది.

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన శేఖర్ కాఫీ తాగుతూ అక్కడే ఉలుకూ పలుకూ లేకుండా దిగులుగా కూర్చున్న అక్కను చూసి సంగతేమిటని అడిగాడు.

ఆమె పరిస్థితి వివరించి చెప్పింది. ''ఎలాగరా తమ్ముడూ! ఒక్క ఇరవై వేల తేడాతో వాడు ఏడాదంతా కష్టపడి చదివిన చదువు వ్యర్థమైపోతుంది'' అని వాపోయింది.

అతనికీ ఏం చెయ్యాలో తోచలేదు. ''నీకు తెలియందేముందక్కయ్యా! ఇప్పటి స్థితిలో నాదగ్గర కూడా పైసా లేదు. నీకు తెలుసుకదా పోయిన ఏడాదే సుప్రియకి ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంక్ రాకపోవడంతో లక్ష డొనేషన్ కట్టాం కదా. నా జీతంలో పావు భాగం దానికి కటింగ్‌గా పోతుంది. మనం మధ్యతరగతి వాళ్ళం. బయట ఎక్కువ వడ్డీలకి అప్పు చేస్తే బతికి బట్టకట్టలేం. ఆ వడ్డీయే మనకెంతో భారమవుతుందక్కా'' అన్నాడు.

''అవున్రా అదీ నిజమే. సరేలే ఎవరికెంత ప్రాప్తమో అంతే. ఈ యేడు కాకపోతే మరో యేడు మళ్ళీ చదువుతాడు. నువ్వు బాధపడకు'' అంటూ నీరసంగా లేచి గదిలోకి వెళ్ళింది సుమతి.

అప్పటివరకూ షాపుకెళ్ళడానికి తయారవుతున్న సౌజన్య ఈ సంభాషణంతా విన్నాకూడా 'ఆ.. ఈ సమస్యలెప్పుడూ వుండేవేలే' అని తేలిగ్గా అనుకుని బయటికి వెళ్ళబోయింది. కానీ ఆమె కాలు ముందుకు పడలేదు. అక్కడే గోడకానుకొని దిగులుగా నిల్చున్న శంతన్‌ని చూస్తుంటే కాదనుకుని వెళ్ళడానికి ఆమె మనసొప్పలేదు. ఆమె బయటకు వెళ్ళకుండా సుమతి గదిలోకి వెళ్ళింది. అక్కడ మంచంపై ఏడుస్తూ కూర్చున్న సుమతి ఆమెను చూస్తూనే కళ్ళు తుడుచుకుంటూ చటుక్కున లేచి నిలబడింది.

''వదినా! బాధపడకు. ఇదిగో నీకవసరమైన డబ్బు నాదగ్గర వుంది. తీసుకో'' అంటూ పర్సు తెరిచి తను నెక్లెస్ కొనడానికని తీసుకెళ్తున్న డబ్బు ఆమెకిచ్చింది.

సుమతి మాత్రం ఆ డబ్బు తీసుకోవడానికిష్టపడలేదు. కానీ సౌజన్య ఎంతో బతిమలాడింది. ''ఈ డబ్బు తీసుకోకుంటే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు'' అంటూ సౌజన్య ఆ డబ్బు సుమతి చేతిలో బలవంతంగా పెట్టి బయటికి వచ్చింది.

''యూ ఆర్ గ్రేట్ సౌజన్యా! నీ మంచితనమే నీకు పెట్టని ఆభరణం లాంటిది. ఒక మంచి స్టూడెంట్‌కి మంచి భవిష్యత్తునిస్తున్నావు'' అంటూ మనస్ఫూర్తిగా అభినందించాడు శేఖర్.

అక్కడే గోడకానుకుని నిల్చున్న శంతన్ రెండు కళ్ళూ తళుక్కున మెరిశాయి. మాట్లాడలేక అత్త చేతులు అందుకుని కళ్ళకద్దుకున్నాడు. నచ్చిన నగ కొనుక్కోలేకపోయానన్న అసంతృప్తి ఏ మూలైనా ఉంటే అది పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది సౌజన్యకి.

★ ★ ★

రెండేళ్ళు అతి త్వరగా గడిచిపోయాయి. అహ్మదాబాద్ నుండి శంతన్ పదీ పదిహేను రోజులకొక ఉత్తరం రాస్తూనే వున్నాడు. తన చదువు సక్రమంగా సాగుతుందనీ, చేతి ఖర్చులకు సరిపడా డబ్బు అక్కడ నాలుగిళ్ళలో ట్యూషన్లు చెప్పుకుంటూ సంపాదిస్తున్నాననీ, మీరు కష్టపడుతూ తనకు డబ్బు పంపనవసరం లేదనీ రాశాడు. సెలవులకు కూడా అక్కడే వుంటున్నాడు. పదే పదే వచ్చి వెళ్ళాలంటే ప్రయాణపు ఖర్చులు కూడా తడిసి మోపెడవుతాయనీ అతని ఉద్దేశ్యం. ఈ రెండేళ్ళ కాలంలో ఇక్కడ కూడా ఎన్నో మార్పులు జరిగాయి. శేఖర్‌కి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. సుప్రియ ఇంజనీరింగు ఆఖరి సంవత్సరంలోకి వచ్చింది. ఇక సుమతి అక్కడికి దగ్గరలోనే వున్న క్రాఫ్ట్ కౌన్సిల్ వాళ్ళతో చిన్న కాంట్రాక్టు కుదుర్చుకుంది. అదెలాగంటే వాళ్ళు కొంత డ్రెస్ మెటీరియల్, చీరలు ఇస్తారు. వాళ్ళు ఇచ్చిన గడువు లోపల వాటిపై వాళ్ళు కోరిన డిజైన్లు చేతికుట్టుతో, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌తో వేసి ఇవ్వాలి. దానికి ప్రతిఫలంగా వాళ్ళు డబ్బులు ఇస్తారు. ఆమె తనకొచ్చిన ఆర్డర్స్‌తో కాస్తో కూస్తో డబ్బు సంపాదించి సౌజన్య ఇచ్చిన డబ్బును ఆమె వద్దని వారించినా ఇచ్చేసింది.

ఇక కాంతమ్మగారికి మోకాళ్ళ నొప్పులు ఎక్కువయ్యాయి. ఆమె నోటిదురుసు బాగా తగ్గింది. ఆమె కాళ్ళు నొప్పిగా వున్నప్పుడు నొప్పి తగ్గేందుకని పెయిన్‌బామ్ కాళ్ళకు రాస్తూ పెద్ద వయసులో జిహ్వాచాపల్యంతో ఆమెకేదన్నా తినాలన్పించిన

## ఏకాగ్రత

తానిప్పుడు ఎంతో ఏకాగ్రతతో ముందుకెళుతున్నానంటోంది శిల్పాశెట్టి. 'ఇంతకుముందులా నేను సెక్సీ సింబల్‌గా ఉండాలనుకోవడం లేదు. ఏకాగ్రతతో ముందుకెళ్లాలనుకుంటున్నాను. కెరీర్‌కి సంబంధించి నాకు కొన్ని ప్రణాళికలు ఉన్నాయి. పెర్‌ఫార్మెన్స్ పరంగా నేను ఎప్పటికప్పుడు నా నటనలో మార్పులు చేసుకుంటున్నాను. ఎవరి వత్తిడులు నాపైన లేవు. ఇప్పుడు నా చేతిలో తక్కువకాకుండా ఆరు సినిమాలు ఉన్నాయి. నా ప్లానింగ్‌తో మరిన్ని ఆఫర్లు వస్తాయి. ఈ సంవత్సరం నా కెరీర్ ఇంకా ఊపందుకుంటుంది' అంటోంది శిల్పా.

బెస్టాఫ్‌లక్!



ప్పుడు ఏ లడ్డూనో, అరిసెలో చేసి పెట్టే సుమతి అంటే ఆమెకు ఒకలాంటి ఆత్మీయత ఏర్పడసాగింది. ఈసారి శంతన్ దగ్గరినుండి వచ్చిన ఉత్తరం శుభవార్తను మోసుకొచ్చింది. ట్రైనింగ్ పీరియడ్‌లో వుండగానే గోద్రెజ్ కంపెనీవారు తనకు జాబ్ ఆఫర్ చేశారనీ, స్టార్టింగే ముప్పైవేలు వుంటుందనీ ఇంటి అద్దె, వెహికలూ అన్నీ కంపెనీవాళ్ళే ఇస్తారనీ రాశాడు.

కాకపోతే ఉద్యోగం చెన్నైలో వచ్చిందనీ, మంచి కంపెనీలో ఉద్యోగం కాబట్టి దూరమైనా ఆలోచించలేదనీ ఇల్లూ అదీ చూసుకున్నాక ఒకసారి వచ్చి సుమతిని తీసుకెళ్తాననీ ఆ ఉత్తరం సారాంశం.

★ ★ ★

శంతన్ సుమతిని తీసుకెళ్ళడానికి హైదరాబాద్ వచ్చాడు. సుమారు మూడు సంవత్సరాల తర్వాత వచ్చిన శంతన్‌లో మార్పు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అతడు చాలా మారాడు. కాస్త ఒళ్ళు వచ్చింది. కొంచెం తెల్లబడ్డాడు, స్టైలు మారింది. ఆ ముఖంలో పసితనపు ఛాయలు పూర్తిగా పోయాయి. ఉద్యోగం తెచ్చిన కాన్ఫిడెంట్‌తో చాలా ఠీవిగా మారాడు. దిగులుగా చూసే అప్పటి ఆ కళ్ళు మచ్చుకి కూడా లేవు. అతని చూపుల్లో ఎంతో స్థిరత్వం వుంది.

రెండురోజుల తర్వాత శంతన్ శేఖర్‌తో ''మామయ్యా! నేను మమ్మీని తీసుకొని రేపు చెన్నై బయలుదేరతాను. ఇన్నేళ్ళూ మమ్మల్ని ఆదరించినందుకు మీకు చాలా రుణపడి వుంటాం. అమ్మకిక్కడ ఏదో కష్టమవుతుందని కాదు, అక్కడ నేను ఒంటరిగా వుండలేక. ఈసారి మీరంతా వెకేషన్స్‌కి మా దగ్గరకు రండి'' అంటూ అతడు అక్కడే ఉన్న సౌజన్య దగ్గరకు వెళ్ళాడు. ''అత్తయ్యా! నేనింతవాణ్ని కావడానికి మీరు చేసిన సహాయం జన్మలో మరువలేను. కానీ చంద్రుడికో నూలుపోగు అన్నట్టుగా నేనిచ్చే ఈ చిరుకానుక మీరు కాదనకుండా తీసుకోవాలి'' అంటూ తన చేతిలోనున్న చిన్న వెల్వెట్ పెట్టెనుండి ఆరోజు సౌజన్య మనసుపడి కొనుక్కోవాలనుకున్న ముత్యాల ఆభరణాన్ని తీసి ఆమె చేతిలో పెట్టి అలాగే వంగి ఆమె కాళ్ళకు నమస్కరించాడు శంతన్.

ఇదంతా చూస్తూ అక్కడికి కాస్త దూరంలో కూర్చున్న కాంతమ్మ చటుక్కున లేచివస్తూ శేఖర్‌తో అంది ''అల్లుడుగారూ! నేనోమంచి మాట చెప్తాను వింటారా. ఈ యేటితో సుప్రియ చదువు ఎలాగూ పూర్తవుతుంది. దాన్నెలాగూ ఒక అయ్య చేతిలో పెట్టేదే. బయటెక్కడో ఎవర్నో చూసి కట్టబెట్టే బదులు బంగారం లాంటి అల్లుడు నీ కళ్ళెదుటే ఉన్నాడు. అందరికీ ఇష్టమైతే ఇప్పుడే 'ఊ' అనేసుకుంటే ఈ వేసవి సెలవుల్లో చక్కగా పెళ్ళి జరిపించొచ్చు. ఏమయ్యా శంతన్‌బాబూ నేనేమయినా పొరపాటు మాట్లాడానా'' అంది.

అతను సమాధానమేమీ ఇవ్వకుండా తల్లి వైపు చూశాడు. సుమతి ఆనందంగా ''అన్నయ్యకీ, వదినకీ, ముఖ్యంగా సుప్రియకీ ఇష్టమైతే నాకంతకంటే కావాల్సిందేముంది'' అన్నది.

అందరూ సుప్రియ వైపు చూశారు. అప్పటికే ఆమె బుగ్గలు సిగ్గుతో కెంపుల్లా మారాయి. కళ్ళు బరువుగా కిందికి వాలిపోయాయి. అందరి దృష్టి ఆమెపై మరలడంతో ఇక అక్కడ నిలబడలేక సిగ్గుతో ముఖానికి చేతులు కప్పుకుని గదిలోకి పారిపోయింది. ''అందరికీ ఆమోదమే. సరే ఇక అడ్డేముందీ శుభం'' అంది కాంతమ్మగారు.

'ఆనాడు తను ఆ ముత్యాల ఆభరణం కొని వుంటే ఈ మూడేళ్ళలో మహా అయితే ఓ నాలుగు సార్లు పెట్టుకునేదాన్నేమో. మిగతా రోజుల్లో అది లాకర్లోనే మూలుగుతుండేది. కానీ తను ఆ నగ కొనాలన్న మోజుని తోసిరాజనటం వలన ఈరోజు లక్ష ఆభరణాల పెట్టు అయిన 'వజ్రం' లాంటి అబ్బాయిని అల్లుడుగా పొందగలిగాను' అనుకుని పొంగిపోయింది సౌజన్య.

